24.

# దైవ లీలలు చిత్రంబులు - త్రైలోక్య పవిత్రంబులు

తల్లి గర్భము నుండి ధనము తేడెవ్వడు
వెళ్లిపోయేనాడు వెంటరాదు
లక్షాధికారైన లవణమన్నమె గాని
మెరుగు బంగారము మ్రింగబోడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటె గాని
కూడబెట్టిన సొమ్ము తోడురాదు
పొందుగా మరుగైన భూమిలోపల పెట్టి
దానధర్మము లేక దాచి దాచి
తుదకు దొంగలకిత్తురో దొరలకగునో
తనది యనియెడు నట్టిది ధనము కాదు
ఆత్మ ఒక్కటె శాశ్వత మరయ జూడ
ఇంతకన్నను వేరెద్ది ఎరుకపరతు.

ప్రేమస్వరూపులారా!

ప్రాచీనకాలము నుండి ఈ పవిత్రమైన భారతదేశమున తల్లిని దైవముగా భావించి, ఆరాధించి, ఆనందించేవారు. వేదపారాయణ సమయమందు మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని చెప్తారు. తల్లే దైవము, తండ్రే దైవము, ఆచార్యుడే దైవము. దేనికి దైవము. ప్రాకృతమైన జీవితానికి దైవము. మానవశరీరమునకు మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ. కానీ జీవితమునకు దైవమే సర్వము.

**త్వమేవ మాతాచ పితాత్వమేవ, త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ, త్వమేవ సర్వం మమ దేవ దేవ.**

ఈ పారమార్థిక జీవితమునకు యిది సత్యము. కానీ, ప్రాకృతమైన తల్లి తండ్రి గృహనివాసి.

sri sathyasai vachanamrutam

ఆచార్యుడు ఆశ్రమ నివాసి. భగవంతుడు మాత్రమే హృదయ నివాసి. హృదయములో నివసించటానికి ఎవ్వరికి అధికారము లేదు. కానీ తల్లి దైవమే, తండ్రి దైవమే. కానీ హృదయములో నివసించటానికి వీరికి అధికారము లేదు. వీరిని గౌరవించాలి, పూజించాలి, ఆనందపర్చాలి. కానీ ఆరాధనకు హృదయవాసియే శాశ్వత దైవత్వము.

**తల్లికంటె మిగులదైవంబు దగ్గర**<br>
**సన్నిహితుడు చాల తండ్రికన్న**<br>
**ఇట్టి దైవము వీడ అబ్బునె పాపంబు**<br>
**సత్యమైన బాట సాయి మాట.**

**మాతృదేవోభవ**

ప్రాకృత జగత్తునందు కుమారుడు ఏ యుద్ధమునందైనా విజయము సాధించ వలెనన్న, తపస్సులో విజయాన్ని సాధించవలెనన్నను, తల్లికి నమస్కరించి, తల్లి ఆశీర్వాదము తీసుకుని, తిరిగి అరణ్యమునకు వెళ్లి తపస్సు ఆచరించటము ఆనాటి సాంప్రదాయము. ధ్రువుడు తల్లి ఆశీర్వాదము పొంది, ఆరు సంవత్సరముల బాలుడు, ఎండ కన్నెరుగని బాలుడు,కారడవులకేగి తపస్సాచరిస్తాను, ఆశీర్వదించమని కోరాడు. యత్రధర్మ తత్ర విజయం. ఎక్కడ ధర్మమో అక్కడ విజయమవుతుంది అని ఆశీర్వదించింది. గురువుకు నమస్కరించాడు. యత్ర ధర్మా తత్ర కృష్ణ, యత్ర కృష్ణో తత్ర విజయం. ధర్మము, దైవము ఎక్కడ ఉండునో అక్కడ మాత్రమే విజయము సాధించగలరు అని ఆశీర్వదించింది. ఆనాటి తల్లులు ఏమి చెప్పినా సర్వము విజయము చేకూరేది. తల్లి ఆశీర్వదించినప్పుడు దైవము తథాస్తు తథాస్తు తథాస్తు అని ఉచ్చరించేవాడు. కేవలం తల్లి ఆశీర్వాదమే చాలదు. దైవానుగ్రహము కూడా అత్యవసరమే. తల్లి ఆశీర్వాద బలముతోపాటు దైవానుగ్రహము అత్యవసరం. తల్లి ఆశీర్వాదము నెగిటివ్. భగవంతుని సంకల్పము పాజిటివ్. ఈ నెగిటివ్, పాజిటివ్ రెండు చేరినప్పుడే కరెంటు ఉపయోగించుకోవటానికి వీలవుతుంది. కనుక ప్రతి మానవుడు తల్లి హృదయాన్ని సంతృప్తిపరచే తత్వాన్ని కలిగి ఉండాలి. తల్లియొక్క హృదయము సంతృప్తి కాకుండా కుమారుడు ఎట్టి విజయము సాధించలేడు. తల్లియొక్క మనస్సు సంతృప్తి పరచే భావనలు,

sri sathyasai vachanamrutam

ప్రవర్తనలు కుమారుడు కల్గి ఉండాలి. దానితోపాటు దైవానుగ్రహమునకు కూడా పాత్రుడు కావాలి. దైవానుగ్రహమునకు పాత్రులు కాక తల్లి ఎంత ఆశీర్వదించినా విజయము సాధించలేరు. ఒకానొక సమయంలో కౌరవులు తల్లి అనుగ్రహమునకు పాత్రులు కాలేదని బాధపడుతూ వచ్చారు. దీనికి కారణం ఏమిటి? తల్లి యొక్క దృష్టి వారిపై ప్రసరించటం లేదు. నూరుమంది కుమారులైనా ఒక్కరిని కూడా తన కంటితో చూడలేదు. యుద్ధము తదనంతరము కృష్ణుడు గాంధారిని చూడటానికి వెళ్లాడు. ధృతరాష్ట్రుడు చాలా బాధపడ్డాడు. గాంధారి చాలా కోపము, దుఃఖము రెండూ కూడిన మాటలు కృష్ణునిపై ఉపయోగించినది. 'కృష్ణా! కౌరవులు, పాండవులు సోదరుల యొక్క పుత్రులే. కౌరవులపై నుండిన ద్వేషమునకు, పాండవులపై ప్రేమకు కారణం ఏమిటి? ఐదుమంది పాండవులను రక్షిస్తూ వచ్చావు. కానీ నూరుమంది కుమారులలో ఒక్కరిని మిగలకుండా చేశావు. ఎంత వ్యత్యాసము నీకు' అన్నది గాంధారి. అప్పుడు నవ్వుతూ కృష్ణుడు చెప్పాడు. 'గాంధారీ! నీవు ఉద్రేకముతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నావు. కానీ యిది నీ తప్పే అన్నాడు. నీవు నూరుమంది కుమారులైనప్పటికిని ఒక్క కుమారునైనా కంటితో చూచావా? తల్లి దృష్టినే నోచుకోలేనివాడు దైవదృష్టి ఏరీతిగా సంపాయించుకో గలడు? కుమారులపై తల్లియొక్క దృష్టి పరిపూర్ణముగా ఉండాలి. నేటి కాలములో దుర్మార్గుడైన కుమారుడైనా ఉన్నాడు కానీ దుర్మార్గురాలైన తల్లి లేదు. అట్టి తల్లి హృదయాన్ని చవిచూచి ఆమెను సంతృప్తిపరచటానికి తగిన కృషి చేయాలి. కనుక మాతృదేవిని ఎంత ఆనందపరుస్తే మాతృదేశము అంత ఆనందమును అనుభవిస్తుంది. జననీ, జన్మభూమి రెండు చాలా ఆధారమైనవే. ఈ జన్మభూమి యందు తగిన గుణములు సంపాదించాలి.

**దైవప్రీతి - పాపభీతి**

**దైవప్రీతిలేని దానవత్వము బట్టి**
**పాపభీతిలేని దాని బట్టి**
**మానవత్వమణగే మానవులందున**
**విశ్వశాంతికిదియె విప్లవంబు**

sri sathyasai vachanamrutam

ఈనాడు ఎక్కడ చూచినా దైవప్రీతి కనిపించటం లేదు. దానికి విరుద్ధముటగా పాపప్రీతి, దైవభీతి ఈ రెండు అభివృద్ధి పొందుతున్నాయి. పాపమంటే భయము లేదు. పుణ్యమునకు ముందంజ వేయటం లేదు.

**పుణ్యస్య ఫలమిశ్చంతి పుణ్యం నేచ్ఛంతి మానవః**
**న పాప ఫలమిశ్చంతి పాపం కుర్వంతి యత్నతః**

పుణ్యకార్యము చేయటానికి ఉత్సాహం రావటం లేదు మానవునకు. కానీ పుణ్య ఫలము కావాలని ఆశిస్తున్నారు. పాప కార్యము చేయటానికి వెనుకంజ వేయటం లేదు. కానీ పాపఫలం అక్కరలేదని ఆశిస్తున్నారు. ఎట్టి విత్తులు నాటుదుమో అట్టి మొక్కనే. ఎట్టి మొక్కయో అట్టి ఫలమే మనకు లభ్యమవుతుంది. కనుక పాపకార్యములకు వెనుకంజ వేయాలి. పాపాన్ని నివారించకపోవటం, ఉపేక్షించటం కూడా పాపమే. పుణ్యకార్యములకు ముందంజ వేయాలి. కుమారులు యుద్ధమునకు పోయే సమయమందు కుంతీదేవి చక్కని ఆశీర్వాదము నందిస్తూ వచ్చింది. నాయనా! మీరు యుద్ధమునకు పోతున్నారు. యుద్ధములో విజయము సాధించటానికి పోతున్నారు. విజయము జరుగుతుంది. కానీ నా హృదయబాధ మీకు చెబుతున్నాను వినండి అంది.

**తారాకాఖ్యాసుర దోర్దర్పమణచువేళ**
**గౌరి తనయుకిచ్చె వీర రక్ష**
**మాతృదాస్యంబు మాన్ప నరగువేళ**
**వినతపుత్రునకిచ్చె విమలరక్ష**
**జనకు యానతి పాలింపవనికి నెగెడు వేళ**
**తల్లి రఘువునకిచ్చె ధర్మరక్ష**
**అట్టి ఘనరక్ష శ్రీరక్ష అంగరక్ష**
**రక్షలందున దివ్యమౌ శ్రీరామరక్ష**
**తోడు నీదై నిన్ను కాపాడు గాక.**

**నిష్కపట ప్రేమ మాతృప్రేమయే**

sri sathyasai vachanamrutam

తల్లి ఆశీర్వాదము ఎంతైనా అవసరము. ఇట్టి మాతృప్రేమను నిరూపించే నిమిత్తమై స్వామి కూడా, స్వామికి తల్లి తండ్రి అనే ప్రాపంచిక ప్రేమ. లేకపోయినప్పటికి జన్మయొక్క ఆదర్శమును అందించే నిమిత్తమై వారి సమాధికి వారి పుట్టిన దినమున వెడుతుండేవాడిని. ఎందుకోసం వెడుతూ వచ్చాను? నేను ఏమి చేసినా యితరులకు ఆదర్శము నిరూపించుతూ వచ్చాను. ఈ భావము పురస్కరించు కొనియే తల్లియొక్క ఉత్తమ మనస్సు కరగిపోతూ ఉంటుంది. యిప్పటికి ఈ శరీరమునకు తల్లి మరణించి 30 సం॥లు అయిపోతుంది. కానీ ఆమె సజీవంగానే సదేహంగానే సంచరిస్తున్నాది. నా రూములో ముగ్గురు పిల్లలు పడుకుంటారు. వారు కూడా ఈ దృశ్యాన్ని చూచారు. ఇది ఎందుకు యీ రోజు చెబుతున్నానంటే ఆదర్శవంతమైన తల్లుల జీవితము అమృతమయమైన జీవితమే. భజన అయిన తరువాత నేను లోపలకు వెళ్లి ఆహారము తీసుకొన్నాను. రాత్రి 9-30 గం॥లకు. వచ్చిన ఈశ్వరమ్మతో "శరీరముతో ఎందుకు వచ్చావు?" అని నేను ప్రశ్నించాను. "స్వామీ! మీకు ఒకటి విన్నవించుకోవాలని వచ్చాను అంది. మీకు అన్నీ తెలుసు. సర్వజ్ఞులు. కానీ ఒక్కటి మాత్రం మీరు అదుపులో పెట్టాలి అన్నది. ఏమిటి? ప్రతి భక్తుడు, student అప్పుడప్పుడు మీకు చేతిగుడ్డ అందిస్తుంటాడు. కానీ నా ప్రార్ధన మన్నించి ఎవరి చేతి రుమాలు మీరు తీసుకోవద్దండి. కాలము సరిలేదు. చేతి కర్ఛీఫ్‌లో విషమంతా పూస్తుంటారు. మీరు సహజంగా అందించుకొని తుడుచుకుంటారు. ఎవరు మీకు నమ్మకమైనవారో, ఎవరు సరైన భక్తులో వారిది మాత్రమే తీసుకోండి. అందరి చేతిరుమాలు ముట్టకండి" అని ఈశ్వరమ్మ ప్రార్థించింది. తల్లి ప్రేమ మరణించిన తరువాత కూడా సజీవంగానే ఉంటుంది. మరి రెండు పర్యాయములు రాత్రిపూట కూడా వచ్చింది. నా రూములో పడుకునేవారు కూడా చూచారు. వారు ఎప్పుడు ఈమెను చూచినవారు కాదు. ఎవరు ఈ ముసలమ్మ? ఎలా వచ్చిందని ఆశ్చర్య పడుతున్నారు. Lift కు తాళంచెవి మాదగ్గరే ఉన్నాది. దానికి మెట్లు లేవు. ఎట్లా వచ్చింది యీమె అని పిల్లలు అడుగుతున్న సమయంలో నేను లేచాను. మీరు ఏమి అడగకండి అని "మరి ఎందుకోసం వచ్చావు?" అని నేను అడిగాను. ఈశ్వరమ్మ చెప్పింది "అప్పుడప్పుడు నేను మిమ్మల్ని చూడందే ఉండలేను. మిమ్మల్ని ఒకసారి చూచినప్పుడే ఆనంద మవుతుంది. మిమ్మల్ని చూచిపోవటానికి వచ్చాను

sri sathyasai vachanamrutam

అని అప్పుడు రెండు మాటలు చెప్పింది. స్వామికి అందరూ భక్తులము, భక్తులము అని చెప్పుకుంటుంటారు. కానీ ఎవరు భక్తులో, ఎవరు భుక్తులో మాకు తెలియదు. పరిపూర్ణ భక్తుడు దేనికైనా సిద్ధంగా ఉంటాడు మీ ఆజ్ఞకు. కానీ కొందరు స్వార్థం కోసమని భక్తిని ప్రకటిస్తూ వస్తుంటారు. కానీ మీ నుంచి వారి కోర్కెలు నెరవేర్చు కుంటారు. తరువాత మిమ్మల్ని మరచిపోతుంటారు. ఈ విషయంలో మీరు జాగ్రత్తగా ఉండండి" అనింది. నేను చెప్పాను, నా జాగ్రత్త నాకు తెలుసు. నీవు చెప్పనక్కరలేదు అన్నాను. నవ్వుకుంటూ తిరిగి వెళ్లిపోయింది. మాతృప్రేమ యీవిధంగా ఉంటుందని తెల్పటానికి యీ ప్రత్యక్ష ప్రమాణాలు మీకందిస్తున్నాను. ఆమె దేహము మాత్రం వదిలింది గానీ ప్రాణం ఎప్పుడు స్వామితోనే ఉంటుంది. "నీ కోసం ఎన్నో వ్రతములు చేశాను. ఎన్నియో పూజలు చేశాను. నా పూజాఫలము పండింది. నీతో నేను 40 సం॥లు ఉండినాను. ఇదే నా ధన్యము. ఇదే నిజమైన ప్రాపర్టీ" అనింది.

ఇంక ఈ దేహమునకు తాత కొండమరాజు. అతను అంతే. ఆయనకు నలుగురు కుమారులు. పెద్ద వెంకమరాజుకు యీ దేహము పుట్టినటు వంటిది. రెండవ ఆయనపేరు చిన వెంకమరాజు. మూడవ ఆయన పేరు సుబ్బరాజు. నాల్గవ కుమారుని పేరు వెంకట్రామరాజు. ఈ నలుగురు ఉండినప్పుడు చాలామంది పిల్లలు కావటం చేత వారు భాగములకోసమని ప్రయత్నిస్తూ వచ్చారు. అప్పుడు ఈ దేహమునకు 8 సం॥లు. కొండమరాజును ప్రశ్నించారు ఈ నల్గురు కొడుకులు. ఈ వయస్సులో మీరు విడిగా ఉండటం మంచిది కాదు. ఒక్కొక్క కుమారుని దగ్గర ఒక్కొక్క ఐదు నెలలు మీరు ఉండండి అన్నారు. ఆయన చెప్పాడు. ఎవ్వరు నాకు అక్కరలేదు. మీరందరు ప్రాపరిటీ తీసుకోండి. నాకు మాత్రం ఒక్క ప్రాపరిటీ ఉంచండి అన్నాడు. ఏది కావాలి అన్నారు. సత్యాన్ని నాకివ్వండి చాలు అన్నాడు. సత్యము నాతో ఉంటే సర్వము ఉండినట్లే. అప్పటి నుండి నేను కొండమరాజు దగ్గరనే ఉండేవాడిని. ఆయన 112 సం॥లు గడిపారు. ఆయన పరమభక్తుడు. అలాంటి భక్తుడు నా సత్యము చక్కగా గుర్తించుకున్నాడు. తొమ్మిదో సం॥ము ప్రారంభమవుతున్నది. అప్పుడు ఎవరు లేరు. పోయి తలుపు వేసేశాడు. నేను వంట చేస్తున్నాను. అతనికి వంట చేసి పెట్టటం నా పని. నాకు వంట చాలా బాగా తెలుసు.

sri sathyasai vacharamrutam

ఇంటింటివారు వచ్చి నేను చేసిన కూరలు తీసుకు పోయేవారు. తలుపు వేశాడు. నేను వంట చేస్తుంటే వచ్చాడు. సత్యా సత్యా సత్యా అన్నాడు. ఏమి? అడిగాను. నా రెండు చేతులు గట్టిగా పట్టుకుని యివి చేతులు కాదు నీ పాదాలని తలంచుకో. నేను ఒక కోరిక కోరుతున్నాను. నీవు నా అంత్యసమయములో నీ చేతులతో నానోట్లో నీరుపోయాలి అన్నాడు. నేను అప్పుడు వాగ్దానము యిచ్చాను. తరువాత అతడు 19 సం॥లు బ్రతికాడు. కొత్త మందిరము కట్టిన తరువాత ఉదయము సాయంత్రం వచ్చిపోయేవాడు. ఎంతైనా మానవత్వమునకు ఒక అభిమానము ఉంటుంది. ఆ అభిమానమమకారము చేత తన హృదయాన్ని పూర్తి వివరించుకోలేకపోతారు మనుష్యులు. తెల్లవారు ఝామునే వచ్చేవాడు. కొత్త మందిరమునకు ముందు పడుకునేవాడిని. ఇసుక ఉంటే యిసుకపైన పడుకునేవాడిని. ఆయన వస్తున్నాడని తెలుసుకుని నిండుగా కప్పుకునేవాడిని. పూర్తి ముఖం వరకు కప్పుకున్నాను. ఎందుకంటే అతనికి నేను మేలుకున్నట్లు తెలియకూడదు. నిద్రపోతున్నాడు కదా అని పాదాల దగ్గర దుప్పటి తీసి పాదాలకు నమస్కారము చేసిపోయేవాడు. ఇతరులు చూస్తే నూరు సం॥ల దగ్గరి వయస్సు వాడు తన మనుమనికి నమస్కారము చేస్తుంటే ఏమన్నా అనుకుంటారేమోనని అభిమానము అతనికి. ఆయన పోతూనే నేను లేచి కూర్చునేవాడిని.

**మేను మరచి నిదురించే వారిని మేలుకొలపగలరె ఎవరైనా**
**కనులు మూసుకుని నిదుర నటించే ఘనుని లేపగా ఎవరితరము**
**జాలమేలోయి కృష్ణా లీలలు చాలోయి**

గోపికలు పాడేవారు. పూర్తి నిద్రలోనున్న వారిని ఎవరైనా వచ్చి లేపవచ్చు. కన్నులు మూసుకుని నిద్రపోయినట్టుగా నటించేవాడిని ఎవరు లేపలేరు. లేపటానికి సాధ్యము కాదు. ఈవిధంగా నేను లీలలు చేస్తూ వచ్చాను. ఆయనకు చెప్పిన వాగ్దానము సమీపించింది. అప్పుడు కారు నేనే డ్రైవు చేసుకొని పోయేవాడిని. మారిష్ 200 కార్‌లోకూర్చుని సిటీలోకి వెళ్లాను.కొండమరాజు ఈశ్వరమ్మను పిల్చాడు. ఈశ్వరమ్మా రా అన్నాడు. స్వామి వస్తున్నాడు. నా కోసమే వస్తున్నాడు. సమయం వచ్చింది. నీవు ఒక టంబ్లరుతో మంచినీరు తీసుకునిరా అన్నాడు. ముందున్న తులసీదళము తీసి గ్లాసులో వేయమన్నాడు.

sri sathyasai vachanamrutam

నేను రాగానే నన్ను కూర్చోమన్నాడు మంచంపైన. స్వామీ! ఆకాశమైనా ముక్కలు కావచ్చుగానీ, సముద్రము ఎండిపోవచ్చుగానీ నీ వాగ్ధానము వృధా కాదు. 19 సంవత్సరాల క్రితము యిచ్చిన వాగ్ధానము కోసం యిప్పుడు వచ్చారు అన్నాడు. నేను నవ్వినాను. నవ్వులతో నన్ను మోసం చేయకండి. ఇదిగో ఒక టంబ్లరు తీసుకుని ఒకతూరి త్రాగి ఆ శేషమునా నోట్లో పోయండి అన్నాడు. ఆయన ఒక చరిత్ర చెప్పాడు. ధశరధుడు పుత్రకామేష్టి చేసి నల్గురు కుమారులను కన్నాడు. సాక్షాత్ నారాయణమూర్తే అతని కుమారునిగా పుట్టాడు. ఆదిశేషుడే లక్ష్మణుడుగా పుట్టాడు. శంఖ చక్రములే భరత శత్రుఘ్నులుగా పుట్టారు. అట్లా పుట్టినప్పటికి ఒక్కరైనా నోట్లో నీరు పోసేవారు లేకపోయారు. స్వామీ! మా రత్నాకర వంశములో మీరు జన్మించారు. ఆపస్థంభ సూత్రము, భారద్వాజగోత్రము. అన్నీ దైవానికి సంబంధించినవే. ఆ దైవము నా గృహములో పుట్టాడు. ఇదిగో యీ ఒక్క ప్రాప్తి అందించండి. నిరాశ చేయకండి అన్నాడు. చెప్పాను.' దానికోసమే వచ్చాను' అన్నారు. నీరు తీసుకుని పోద్దామంటే, 'వద్దు వద్దు, మీరు త్రాగి యివ్వాలి' అన్నాడు. నేను కొంచెం త్రాగి అతని నోట్లో పోశాను. "ఈశ్వరమ్మ! స్వామి ప్రభావం యావత్ప్రపంచమంతా ప్రాకుతుంది. ఈ ప్రపంచమే చాలా మార్పుచెందుతుంది. విదేశములవారు కూడా యిక్కడ నివసించుతారు. జాగ్రత్తగా ఉండండి. మాయతో నాకుమారుడు మీ పిల్లవాడు అనే అభిమానము నకు అవకాశము యివ్వకండి. అతడు అందరి వాడు. **బృందావనమది అందరిది గోవిందుడు అందరి వాడేలే.** స్వామి అందరివాడు. మన కుటుంబమునకే సంబంధించిన వాడు కాదు అని చెప్పాడు కొండమరాజు. ఆవిధముగా చెప్పి నా పాదములపై చేతులు పెట్టి ప్రాణము విడిచాడు. ఆయన తిరిగి అప్పుడప్పుడు వస్తుంటాడు. 'స్వామీ యింక నాకు జన్మ లేదు. మీ ప్రసాదము చేత ధన్యుడై పోయినాను. అమృత స్వరూపుడైపోయినాను' అని అప్పుడప్పుడు తిరిగి అదే దేహమే వచ్చి, కొన్ని అట్లా జరుగుతున్నాయి, ఇట్లా జరుగుతున్నాయి మందిరములో జాగ్రత్తగా ఉండండి స్వామీ జాగ్రత్త అని చెప్పి పోయేవాడు. మీరు ఎవరికి చిక్కరు. మీకు ఎట్టి భయము లేదు. కానీ దేహముతో సంబంధముంది కనుక చెప్పుకుంటున్నాను యిది నా ప్రార్థనగా భావించండి అనేవాడు. ఇప్పటికి కూడా కొండమరాజు, ఈశ్వరమ్మ

sri sathyasai vachanamrutam

అప్పుడప్పుడు వస్తుంటారు. నాతో మాట్లాడి పోతుంటారు.

**దైవలీలా విలాసము**

మొన్న ప్రశాంతి నిలయములో ఎవరికో heart attack వచ్చి serious గా ఉంటున్నారు. నేను రాత్రి 2 గం॥లప్పుడు దేహాన్ని వదలిపెట్టి పోయాను. రెండవ దినము మధ్యాహ్నం 3 గంటలవరకు దేహము బయటకు రాలేదు. చాలామందికి ఎందుకు స్వామి రాలేదు ఎందుకు స్వామి రాలేదని బాధపడుతూ వచ్చారు. రాత్రి అక్కడ పండుకునే పిల్లలు, క్రింద పడుకొనే పిల్లలు పైకి వచ్చారు. ఏడుస్తున్నారు. పాపం వీరితోపాటు చిరంజీవిరావు పోయి డా॥అల్‌రేజాను తీసుకువచ్చాడు. అల్‌రేజాకు స్వామి అంటే చాలా భక్తి. అతను 40 సం॥ల నుండి ప్రశాంతి నిలయములో ఉంటున్నాడు. వచ్చాడు. పల్సు చూచాడు. అతనికి ఏమీ కనిపించలేదు. ఏమి చెప్పలేక ఏడ్చాడు. దేహములో ఉండవలసిన లక్షణాలు ఒక్కటీ లేవు అన్నాడు. అప్పుడు చిరంజీవి రావు చెప్పాడు స్వామి అప్పుడప్పుడు దేహాన్ని వదలిపోవటం సహజము. ఎవరికి ఏమీ చెప్పకండి అని ఆరుమంది పిల్లలకు చెప్పాడు. ఆరుమంది చాల మంచి పిల్లలు. స్వామి కాలేజీ లోపలనే MBA pass చేసుకొని ఢిల్లీకి పోయి ట్రైనింగు అయి హాస్పటల్‌లో టెక్నీషియన్సుగా పనిచేస్తున్నారు. బయటకు ఎక్కడికి వెళ్లమన్నారు. అక్కడే ఉన్నారు. పిల్లలు ఎంత చెప్పినా భరించుకో లేకపోయారు. అందరు వచ్చి కాళ్లపై పడిగట్టిగా ఏడ్చారు. తిరిగి తక్షణమే నవ్వుకుంటూ వచ్చాను. ఏమిటీ నాటకమంతా అని పిల్లలను అడిగాను. "స్వామీ! డ్రామా ఆడేది మేమా మీరా" అని పిల్లలు అన్నారు. శ్రీనివాస్ అని ఒక అబ్బాయి ఉన్నాడు. అతను ఇంజనీరింగ్ పాస్ చేసి MBA పాస్ చేసి అక్కడే ఉన్నాడు. 'ఇదంతా మీ లీలానాటకమే, మా నాటకము కాదన్నాడు. బయట అంతా కాచుకొని ఉన్నారు. నేను వెళ్లాలి' అన్నాను. తెల్లవారి లేచినది మొదలుకొని మధ్యాహ్నం మూడు గంటల వరకు నీరైనా త్రాగలేదు. ఏదైనా మజ్జిగ త్రాగండి అన్నారు. నాకది అలవాటు లేదని చెప్పాను. వచ్చాను స్నానం చేసి బయటకు వెళ్లాను. ఈవిధంగా అప్పుడప్పుడు చాలా జరుగుతున్నాయి నేను ఉండే దగ్గర మా పిల్లలు అక్కడుండే వారి కందరికి తెలుసు. ఈ తల్లి ప్రేమ యిలా ఉంటుంది అని ప్రత్యక్ష ప్రమాణంగా నిరూపిస్తూ వచ్చాను. తల్లి ప్రేమ పొందిన వానికి జీవితమంతా అమృతమయంగానే ఉంటుంది. ఆ

sri sathyasai vachanamrutam

తల్లి కూడా కుమారుని ఉత్తమ భావాలను కొంత పోషిస్తూ రావాలి. కుమారుడు ఆధ్యాత్మిక మార్గములో ఉంటే ఏమైపోతారో ఏమైపోతారో అని కొంతమంది తల్లులు దిగులు పడుతుంటారు. ఎన్ని జన్మల పుణ్యమో వారికి ఆప్రాప్తి లభిస్తుంది. దానికి మనం ఆనందించాలిగానీ విచారించకూడదు. చాలమంది తల్లిదండ్రులు చదువులు అయిన తర్వాత వివాహము చేయాలి. వారు ఉద్యోగములు చేయాలి, గొప్పవారు కావాలి. తల్లిదండ్రులు ప్రేమచేత గొప్పవారు కావాలని కోరుతుంటారు. కానీ స్వామి ప్రేమ అలాంటిది కాదు. గొప్పవారు కాదు. మంచివారు కావాలి. గొప్పకి, మంచికి ఉన్న వ్యత్యాసము ఏమిటి? మంచివారు మానవుని యందు కూడా దైవాన్ని చూస్తారు. గొప్పవారు దేవుని యందు కూడా మానవత్వాన్ని చూస్తుంటారు. రావణుడు గొప్పవాడే. గొప్ప తపస్వి. మహాశక్తి వంతుడే. కానీ రామునిలో మానవత్వం చూసి యితడు మానవుడు అని భావిస్తూ వచ్చాడు. రాముడు అట్లా కాదు. సర్వజీవులందు దైవత్వము నిరూపిస్తూ వచ్చేవాడు. అది మంచితనం. ఈశ్వర స్సర్వభూతానాం, ఈశావాస్యమిదం సర్వం. గొప్పతనమునకు, మంచితనమునకు ఉండే వ్యత్యాసమింతే. గొప్ప ఉద్యోగములు చేసి, గొప్ప చదువులు చదివి, గొప్పగా సంపాయించిన మాత్రమున ప్రయోజనం లేదు. గొప్పవాడని పేరు రావచ్చును. కానీ మంచివాడు good man అనే పేరు రావాలి. Not great man. గొప్పవాడుగా ఉంటే వచ్చే ఫలితమేమిటి? కేవలం అంతా స్వార్థమే, స్వార్థమే. మంచివాని యందు నిస్స్వార్థమే, నిస్స్వార్థమే. కనుక ప్రతి పిల్లవాడు మంచివాడుగా తయారుకండి. తల్లిదండ్రులను గౌరవించండి. వీరికి ఆనందమివ్వండి. వారికి కృతజ్ఞత చూపాలి. ఈవిధంగా నేను చెబుతూ ఉంటాను. వారు దానికి అంగీకరిస్తుంటారు. కానీ ఒక్కొక్క సమయంలో వారికి కూడా కొంత స్వార్థము ఉంటుంది కదా. తల్లిదండ్రులకు ఏవిధంగా స్వార్థముంటుందో కుమారుని కూడా కొంత స్వార్థముంటుంది. మీకందరికీ తెలుసు – "తల్లిదండ్రులు ఈవిధంగా ఉండాలని కోరుతున్నారు. నాకు అది ఇష్టము లేదు. నేను స్వామి దగ్గరనే ఉండాలి. స్వామి సేవ చేయాలి" అని కొడైకెనాల్ వచ్చిన పిల్లలందరికి పబ్లిక్‌లోనే చెప్పాడు సత్యజిత్. తల్లిదండ్రులు కూడా ఉన్నారు అక్కడే. "నా ఉన్న సందేహము మీకు చెబుతున్నాను. మీరు

sri sathyasai vahamrutam

వేరే విమర్శగా భావించకండి అందరు క్షమించాలి"అని మొట్టమొదట ప్రార్థన చేశాడు. చెప్పాడు. ఎంతమందో అధికారులంతా వస్తున్నారు స్వామి దగ్గరికి. వారివారి కోరికలు నెరవేర్చుకొని వెళ్లిపోతున్నారు. ఎంతమందో బిజినెస్ పీపులు వస్తున్నారు. వారి కష్టనష్టాలు స్వామితో విచారించుకొని దానినుండి వారు ఆదాయము పొంది వారు వెళ్లిపోతున్నారు. రోగిస్టులంతా వస్తున్నారు. వారి రోగములను బాగు చేసుకొని ఆనందముగా వెళ్లిపోతున్నారు. అనేకమంది వస్తున్నారు విద్యను అభ్యసిస్తున్నారు. స్వామి అందిస్తున్న free education అందుకుంటున్నారు. వెళ్లిపోతున్నారు. ఎవరు స్వామి యొక్క మంచిని చూడగలుగుతున్నారు? స్వామి యొక్క మంచిని ఎవరు తల్చుకుంటున్నారు. ఎవరు తల్చుకోటం లేదు. స్వామి ఎప్పుడంటే అప్పుడు పడిపోతుంటాడు. స్వామి దేహ రక్షణ భక్తుల విధి అన్నాడు సత్యజిత్. తనకు కూడా తెలుసు. ఒకరోజు పడ్డాను. ఒకపెద్ద పిల్లర్ నాపై పడిపోయింది. దానిని నేను care చేయను. చాలా బాధపడుతూ వచ్చారు. ఇదంతా చూసినవాడు కనుక స్వామి వెంట ఎప్పుడూ ఒకరు ఉండాలి అని నిర్ణయించుకున్నాడు.... "నా జీవితమంతా స్వామి పాదాలకు అర్పితము కావాలి" అని పబ్లిక్‌లో చెప్పాడు.... ఒక్కొక్కరికి ఒక్కొక్క విధమైన ఆశయాలు ఉంటుంటాయి. కానీ మాతృభావము ఉండిన వారికి ఎప్పుడు ఉత్తమభావాలే ఉంటాయి. ఒకనాడు తనతల్లికి కాలు విరిగిందని ఆపరేషను జరిగింది. చెప్పకూడదు కానీ నాకు అందరు మంచివారే. కానీ యీ పిల్లవానిలో ఒక ప్రత్యేకత ఉన్నాది. తల్లి ప్రశాంతి నిలయం వచ్చినప్పుడు స్వామి ఆజ్ఞ తీసుకొని పోయి, కొంతసేపు తల్లి కాళ్లు వత్తి వచ్చేవాడు. ఎందుకంటే ఆమెకు నడవటానికి నెప్పి అని ఆ సేవ చేయాలని అనేవాడు. బృందావనంలోనే నేను మధ్యాహ్నం పండుకున్నాను. వచ్చి మెత్తగ పాదములు వత్తుతున్నాడు. నాకేమీ నెప్పి లేదే అన్నాను. "మీరు నొప్పి ఉండినా చెప్పరు. యింత తిరుగాడుతూ ఉంటారు. ఒకసారి వత్తి పోతాను" అన్నాడు. నీకు ఎట్లా అభ్యాసం? అయింది అన్నాను. నా తల్లికి యీ సేవ చేసి నాకు అభ్యాసంగా ఉంది అన్నాడు. వత్తినాడు. కొంచెం సేపు అయ్యేటప్పటికి స్వామి లేదు అక్కడ. స్పష్టంగా చూచాడు. తిరిగి కొద్దిసేపటికి స్వామి పాదాల దగ్గర ఉన్నాడు. ఇవన్నీ తనకి experience. ఇంత experience నేను అనుభవించినప్పుడు నేను ఎట్లా ఈ ప్రపంచాన్ని కోరతాను. అప్రాకృతమైన

sri sathyasai vahini amrutam

జీవితము నాకు అక్కరలేదు అన్నాడు. M.Sc. pass చేశాడు. తిరిగి MBA చేరాడు. నేను చెప్పాను PG అయింది కదా! ఎందుకు MBA అన్నాను. "యింకా రెండు సంవత్సరాలు యిక్కడ ఉండవచ్చు అని MBA చేరాను స్వామీ" అన్నాడు. ఈవిధంగా ఒక్కొక్కరికి ఆశ ఉంటుంది. ఇలాంటి పిల్లలు ఎంతమందో ఉన్నారు పాపం. కనుక మాతృభావము రుచి చూసినవారు దైవాన్ని కూడా మాతృభావంతో చూస్తారు. కొంతమంది చదువుతున్నారు. పోతున్నారు బయటికి. ఏమి సుఖపడుతున్నారు? ఏమి శాంతి పొందుతున్నారు? ఏజన్మాంతర ఖర్మకో వీరికి పుట్టి పడిపోతున్నారు అంటాడు సత్యజిత్. కాదుకాదు. దైవము చిక్కిన తరువాత యింక ఏదీ మనకు అక్కరలేదు. ఆ దైవమే తల్లిని తండ్రిని అందరిని చూచుకుంటాడు. ఆ గాఢ విశ్వాసము ధృఢంగా ఉండాలి. లేకపోతే ఎవరికి సుఖము లేదు.

పుట్టపర్తిలో ప్రహ్లాద అనే సినిమా నెల్లూరు రెడ్డి సినిమా తెచ్చి చూపించాడు. చిన్నపిల్లలు. ప్రహ్లాదుడు తండ్రి విషము త్రాగించినా నారాయణ నారాయణ అని త్రాగాడు అది నారాయణునికే చెందింది. చండ అమాత్యులతో చెప్పి కొండలనుండి నెట్టించాడు. నవ్వుకుంటూ నారాయణ నారాయణ అన్నాడు క్రింద నారాయణుడే చేయి పట్టుకున్నాడు. పాములను తెచ్చి కరపించారు. నారాయణ నారాయణ అన్నాడు. పాములన్నీ హారములుగా మారిపోయినాయి. ఏనుగులతో తొక్కించారు. నారాయణ నారాయణ అన్నాడు. ఏనుగు కూడా నారాయణ రూపం పొందింది. స్వామి అవన్నీ సినిమాలు కానీ నేను ప్రత్యక్షంగా చూస్తున్నాను. కాబట్టి నాకు ఏ నారాయణుడు అక్కరలేదు. సాయి నారాయణుడు చాలు అన్నాడు. ఈవిధముగా లేత వయస్సునందే ఏ జన్మాంతర సుకృతము వల్లనో యిలాంటివన్నీ ప్రాప్తిస్తుంటాయి. ఉత్తమభావాలు ఉంటాయి. కొంతమంది కాలేజీలో ఉన్నంత వరకు పరమభక్తులే. బయటికి పోగానే పరమ దుర్మార్గులే. వారి నోరు చేసే పని వారు చేసే పనులు ఎంత చెడ్డవో అంత చెడ్డగా ఉంటున్నాయి. కనుకనే నేను కొడైకెనాల్‌లో కూడా చెప్పాను. ఎందుకంటే మంచి వాక్కు రావాలి. ఆ మంచి వాక్కు లేక ప్రయోజనం ఏమిటి? సమ్యక్ దృష్టి. మంచి దృష్టి రావాలి. సమ్యక్ దృష్టి వస్తే సమ్యక్ భావం ప్రవేశిస్తుంది. సమ్యక్ భావము వస్తే సమ్యక్ శ్రవణమైపోతుంది. సమ్యక్ శ్రవణమయ్యేటప్పటికి సమ్యక్ కర్మలు చేస్తారు. సమ్యక్ కర్మలే నిర్వాణమునకు మార్గము.

సమ్యక్ దృష్టి. మంచిదృష్టి కల్గి ఉండాలి. కన్నులున్నాయని యిష్టము వచ్చిన వారినందరిని చూడకూడదు. ఈ దృష్టిని మాత్రం మొదట control చేసుకోండి. తప్పక సర్వము control అవుతుంది. అదేవిధముగా స్వామి యొక్క ఆదేశాలు చక్కగా పాటించే కొంతమంది పిల్లలు ఉన్నారు. ఈ తూరి కొడైకెనాలుకి వచ్చిన పిల్లలందరు ఉత్తమ పిల్లలు ఎంత అదృష్టవంతులో చెప్పటానికి వీలుకాదు. కనుక వారి సర్వస్వము నేనే చూసుకుంటూ వచ్చాను. ఈవిధమైన పిల్లలు లోకములో అభివృద్ధి అయితే దేశము ఎంతో బాగుపడుతుంది. వ్యక్తి బాగుపడినప్పుడే సమాజం బాగుపడుతుంది. సమాజం బాగుపడినప్పుడే దేశం బాగుపడుతుంది. కనుక మొట్టమొదట వ్యక్తి బాగుపడాలి. వ్యక్తి వ్యష్టి. సమాజమే సమిష్టి. వ్యష్టి సమిష్టితో కూడాలి. ఈ సమిష్టి స్వరూపమే ఈ సృష్టి. వ్యష్టి, సమిష్టి, ఈమూడింటి ఏకత్వమే దైవత్వం.

**ఈశ్వరుని అమ్మ ఈశ్వరమ్మ**

మొట్టమొదట మాతృదేవిని స్మరించాలి ఆమెకు తగిన సంతృప్తి నందించాలి. ఆమెకు తగిన కృతజ్ఞత అందించాలి. అలాంటి కొడుకుపుట్టాడంటే ఆతల్లి అదృష్టము ఎలాంటిదో! అదే కొండమరాజు చెప్పాడు. ఈశ్వరమ్మ నీవు ఏదో సామాన్య స్త్రీ మాదిరి ఉంటున్నావు. నీవు సామాన్య స్త్రీ కాదు. భగవంతుడు నీ గర్భములో జన్మించాడు. ఎంత అదృష్టవంతురాలవమ్మ. కోడలు ఆమె. ఆ కోడలికి నమస్కారం చేసి చెప్పే మామఅత్తలున్నారా? చాలా అదృష్టవంతురాల వమ్మా ఈశ్వరమ్మా! అని ఆయన పెద్ద అంతరార్థాన్ని యిచ్చాడు. ఈశ్వరమ్మ నీ పేరు సార్థకమై పోయింది. ఈశ్వరుని అమ్మ ఈశ్వరమ్మ. ఆవిధంగా ఆయన వర్ణించాడు. పేరు సార్థకమైంది. ఆవిధంగా తెలుసుకున్నవారు ఎంతో తెలుసుకుంటారు. తెలుసుకోలేని వారు ఎన్ని చూపినా తెలుసుకోలేరు. ఏ కించిత్ దృష్టి ఉన్నా సూర్యోదయము చూడగలడు. అసలు సూర్యుని చూడటానికి కన్నులు లేనప్పుడు సూర్యోదయము ఎలా చూడగలడు. ఆధ్యాత్మికతత్వమున్నవానికి, మాతృభక్తి ఉన్నవారు ఏమైనా సాధించగలరు. మాతృదేవి యొక్క తత్వము ప్రతి ఒక్కరు అర్థముచేసుకోవాలి. కొంతవయస్సు వచ్చిన తరువాత తల్లి ఏమి చేసింది ఏదో చిన్నప్పుడు కాపాడింది. నా దేహాన్ని నేనే చూచుకుంటున్నాను అని



sri sathyasaivachanamrutam

అహంకార పడతారు. గొప్ప చదువు చదివాను, గొప్ప ఉద్యోగి అయినాను అని అనుకుంటారు. ఏమిటీ చదువులు, ఉద్యోగములు. యివన్నీ శాశ్వతము కాదు.

**మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధు సహోదరః**
**అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత**
**జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునః పునః**
**అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత**

**మాతృభావముతో దైవాన్ని ప్రేమించు**

శంకరాచార్యులు కూడా అట్లానే చేశాడు. ఒక్క చిన్న ఊరు. తండ్రి ఎక్కడికో పోవలసి వచ్చి శంకరాచార్యుని తల్లి ఆర్యాంబకు చెప్పాడు. రేపటి దినము పూజ చేయటానికి ఎవరు లేరు. మన పిల్లవాడు శంకరాచార్యకు చెప్పు అన్నాడు. శంకరునికి చెప్పింది. నాయనా ఈనాడు తండ్రి లేడు. రాజరాజేశ్వరికి పాలు నైవేద్యం పెట్టమంది. తీసుకువెళ్ళాడు. పాలు దేవికి యిచ్చాడు. తల్లి నీవు ప్రత్యక్షమై త్రాగాలి. నాన్న యిస్తుంటే నీవు త్రాగుతున్నావట. ప్రసాదము నాకు, తల్లికి యిచ్చేవాడు. కాబట్టి ఈ పాలను తాగాలి అన్నాడు. ఎంతసేపు ప్రార్థించినా తల్లి ప్రత్యక్షం కాలేదు. ఒకరాయి తెచ్చుకొని నీవు త్రాగకపోతే నా తల పగల కొట్టుకుంటాను అన్నాడు. శంకరాచార్యునికి ఏడు సంవత్సరములు. శబ్దము వచ్చింది. కన్నులు తెరిచాడు. రాజరాజేశ్వరి వచ్చింది. పాలు త్రాగింది వెళ్ళింది. అప్పుడు ఏమీ తెలియదు శంకరాచార్యునకు. కప్పు చూచాడు. కప్పులో ఒక్క చుక్క కూడా లేదు. పూర్తిగా త్రాగిపోయింది. నీవు మాత్రం తాగేసి పోతే అమ్మకు నాకు ప్రసాదం కావాలి. కాబట్టి కొంచెము యిచ్చివేయమన్నాడు. ప్రార్థన చేశాడు. తిరిగి ప్రత్యక్షం కాలేదు. పాలను నేనే త్రాగానని తల్లి భావిస్తుంది. నాపై తల్లికి చెడ్డభావము రాకూడదు. ఆమెను సంతృప్తి పరచే కోసమని కొంచెం పాలు యిమ్మన్నాడు. నాయనా! సముద్రములో చేరిన గంగ తిరిగి వాపసు వస్తుందా? నమిలి మింగిన ఫలము తిరిగి వెనక్కి వస్తుందా? పాలు నేను త్రాగాను యింకరాదు అన్నది దేవి. ఏమైనా సరే నాకు కొంచెం పాలు యివ్వాలి అని పట్టుపట్టాడు శంకరుడు. ఆ పిల్లవాని భక్తికి మెచ్చి తన స్తన్యంతో పాలు కప్పులో పిండి యిచ్చింది.

srisathyasaivachanamrutam

దానిని త్రాగారు. దానివల్ల శంకరుడు అవతారపురుషుడుగా మారిపోయాడు. సర్వజ్ఞాని అయ్యాడు. నాలుగు వేదములు, ఆరు శాస్త్రములు 32 సం॥ల లోపలే సర్వము ప్రపంచమునకు చాటుతూ వచ్చాడు. అద్వైత సిద్ధాంతమును ప్రపంచములో చాటుతూ వచ్చాడు. కారణం ఏమిటి? ఆ తల్లి యొక్క పాలు త్రాగటం చేత అంతటి అదృష్టవంతుడయ్యాడు. కనుక తల్లి అంతటి మధురమైన స్వరూపము. మాతృప్రేమ ప్రాకృతమైన ప్రేమయే. కానీ ఆమెకు ప్రాకృతమైన ప్రేమయే మనం అందించాలి. హృదయము మాత్రము ఒక్క దైవమునకు తప్ప మరొకరికి కాదు. అతని పేరే హృదయవాసి. అమ్మపేరు గృహవాసి, నాన్న పేరు గృహవాసి. గురువు ఆశ్రమవాసి. దైవము హృదయవాసి. హృదయములో నివసించటానికి దైవమునకు తప్ప ఎవ్వరికి అధికారము లేదు. కనుక హృదయములో దైవాన్ని పెట్టుకోండి. ప్రపంచములో తల్లిని చూసుకోండి. తల్లికి గౌరవము యివ్వండి. పాదసేవ చేయండి. ఇహమును సుఖియింప హేమతారక విద్య. పరమును సుఖింప బ్రహ్మవిద్య. దీనినే 'దిల్‌మే రాం హాత్ మే కాం' అన్నారు. దేహరీతిగా సేవలు చేయి. హృదయములోపల దైవత్వమును ప్రతిష్ఠించుకో. యిది ఉంటే ఏన్నైనా సాధించవచ్చు. కనుక మాతృమూర్తిని ప్రేమతో మనం చూచుకొని, ప్రేమతత్వంతోనే దైవాన్ని పొందాలి.

**(తేదీ 06-05-1998న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam